సాక్షి నంద్యాల

గురువారం । 21 । సెప్టెంబర్ । 2023



సాక్షిగణపతికి విశేషపూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో బుధవారం సాయంత్రం సాక్షిగణపతి స్వామికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు.



అన్నప్రసాద పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన వి.బంగారు రాజు రూ.1,00,500 విరాళం అందజేశారు.



సుంకేసులలో నీటి నిల్వలు

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌లో బుధవారం 1.068 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు డ్యాం అధికారులు తెలిపారు. కేసీ కాల్వకు 331 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

న్యూస్‌రీల్

వినాయకుడి లడ్డూ @ రూ.లక్ష



లడ్డూతో మల్లేశ్వరప్ప తదితరులు

బేతంచెర్ల: మండల పరిధిలోని యంబాయి గ్రామంలో వినాయక చవితి పండుగ సందర్భంగా గ్రామంలో బుధవారం నిమజ్జన వేడుకలను పురస్కరించుకుని లడ్డూ వేలంపాట నిర్వహించారు. గ్రామానికి చెందిన మల్లేశ్వరప్ప రూ.లక్షకు పాట పాడి లడ్డూను దక్కించుకోగా, అదే గ్రామానికి చెందిన చిన్న సిద్దన్న కొడుకు పెద్ద సిద్దయ్య కలశం టెంకాయను రూ.26 వేలకు దక్కించుకున్నాడు. ఈ నగదుతో వచ్చే ఏడాది ఉత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

మద్దూరు గణనాథుని లడ్డూ రూ.1,01,000

చాగలమర్రి: మండలంలోని మద్దూరు గ్రామ శివాలయంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద ఉంచిన లడ్డూ ఏకంగా రూ.రూ.1,01,000 పలికింది. బుధవారం వినాయక నిమజ్జనం సందర్భంగా లడ్డూ వేలం పాట నిర్వహించారు. గ్రామానికి చెందిన మాదం వెంకటరమణయ్య(బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి) అత్యధికంగా రూ.1,01,000 పాడి లడ్డూను దక్కించుకున్నట్లు నిమజ్జన కమిటీ సభ్యులు తెలిపారు.

జిల్లాకు 4 మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్లు మంజూరు

నంద్యాల(సెంట్రల్): వర్షాధార ప్రాంత అభివృద్ధి(ఆర్ఏడీ) కింద జిల్లాలో ఎంపిక చేసిన రైతు ఉత్పత్తి దారుల సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాసెసింగ్ యూనిట్లు కేటాయిస్తోంది. అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం(మిల్లెట్ ఇయర్)ను పురస్కరించుకుని జాతీయ సుస్థిర వ్యవసాయాభివృద్ధి పథకంలో భాగంగా జిల్లాకు 4 ప్రాసెసింగ్ యూనిట్లు మంజూరైనట్లు జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు బుధవారం తెలిపారు. రూ.2 లక్షల చొప్పున రాయితీపై ప్రాసెసింగ్ యూనిట్లను కేటాయింపు ఉంటుందన్నారు. వ్యవసాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాకు సంబంధించి కొలిమిగుండ్ల, డోన్‌కు 2, ప్యాపిలితో కలిపి నాలుగు యూనిట్ల మంజూరుకు ఎఫ్‌పీఓలను గుర్తించామన్నారు. వీటిని సద్వినియోగం చేసుకుని మహిళలు స్వయం ఉపాధి పొందవచ్చని పేర్కొన్నారు.

శ్రీశైలంలో స్వల్ప విద్యుత్ ఉత్పత్తి

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ఎడమగట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో మంగళవారం నుంచి బుధవారం వరకు స్వల్పంగా 0.835 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ఉత్పాదన అనంతరం దిగువ నాగార్జున సాగర్‌కు 1,590 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యాక్‌వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 3 వేల క్యూసెక్కులు, హంద్రీనీవా సుజల స్రవంతికి 2,180 క్యూసెక్కులు, ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకానికి 245 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. జలాశయానికి వరద ప్రవాహం నిలిచిపోయిన విషయం తెలిసిందే. బుధవారం సాయంత్రానికి జలాశయంలో 90.1364 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యామ్ నీటిమట్టం 854.30 అడుగులకు చేరుకుంది.

గ్రామాల ప్రగతి.. స్థానికులకు ఉపాధి

నంద్యాల(సెంట్రల్): పల్లెల్లో అభివృద్ధి పనులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. అందులో భాగంగా ఓ వైపు అభివృద్ధి కార్యక్రమాలకు భారీగా నిధులు కేటాయించటంతో పాటు స్థానికులనే పనుల్లో భాగస్వాముల్ని చేస్తూ సంతృప్తికరమైన వేతనాలు పొందేలా ముందుకు సాగుతోంది. పనుల ప్రణాళికను పక్కాగా అమలు చేస్తోంది. ఏడాదికి ఒక్కో కుటుంబానికి ఉపాధిహామీ పథకం పనులతో రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు వేతనం గిట్టుబాటయ్యేలా అభివృద్ధి పనులు చేయిస్తోంది. గ్రావెల్ రోడ్లు, కల్వర్టులు, సాగు నీటి వనరుల అభివృద్ధి పనులకు అధిక శాతం నిధులను కేటాయిస్తోంది. తాజాగా ప్రతి మండలానికి అభివృద్ధి పనుల కోసం రూ.60 లక్షల చొప్పున మంజూరు చేసింది. నంద్యాల జిల్లాలోని 28 మండలాలకు కలిపి రూ.16.80 కోట్ల నిధులు కేటాయించింది. వీటితో సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు డ్వామా పీడీ రామచంద్రారెడ్డి బుధవారం తెలిపారు.

30 లోపు ఫీజు చెల్లించండి

నంద్యాల(న్యూటౌన్): ఇంటర్మీడియట్ పరీక్ష ఫీజు ఈ నెల 30వ తేదీలోపు చెల్లించాలని డిప్యూటీ ఈఓ బి.సునీత బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న ఇంటర్ విద్యార్థులు, ఇంతకు ముందు ఫెయిల్ అయిన విద్యార్థులు 2024లో జరిగే పరీక్షలకు ఫీజు చెల్లించాలన్నారు.

వ్యవ‘సాయం’

రైతన్నలకు కిసాన్ డ్రోన్లు

- ఒక్కో డ్రోన్ విలువ రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షలు
- డ్రోన్‌పై 40 శాతం ప్రభుత్వ రాయితీ
- తొలివిడతలో 29 డ్రోన్లు మంజూరు
- దశలవారీగా అందరికీ అందుబాటులోకి
- పైలట్లకు శిక్షణ పూర్తి
- సులభతరం కానున్న మందుల పిచికారీ
- కూలీల కొరతకు చెక్

రైతు సంక్షేమమే ధ్యేయంగా వ్యవసాయ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. విత్తనం మొదలుకొని పంట ఉత్పత్తుల కొనుగోలు వరకు అన్నదాతకు అండగా నిలిచి వ్యవసాయాన్ని పండుగలా మారుస్తోంది. ఏటా రూ.13,500 పెట్టుబడిసాయం అందజేస్తూ గ్రామ సచివాలయాలకు అనుసంధానంగా రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. నాణ్యమైన విత్తనాలు, కల్తీ లేని రసాయన ఎరువులు, క్రిమి సంహార మందులను సరఫరా చేస్తోంది. వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చి ఆయా పంటల్లో అధిక దిగుబడులు సాధించేలా కృషి చేస్తోంది. వీటితో పాటు ఆర్బీకేల ద్వారా వైఎస్సార్ సేవా యంత్ర పరికరాలను అందజేస్తూ సాగుకు సాయం చేస్తోంది. తాజాగా అత్యాధునిక టెక్నాలజీతో పురుగు మందుల పిచికారీకి డ్రోన్లను అందించే దిశగా చర్యలు చేపట్టింది.

– కోవెలకుంట్ల

నంద్యాల జిల్లాలోని 29 మండలాల పరిధిలో ఏటా ఖరీఫ్ సీజన్‌లో 2.28 లక్షలు, రబీలో 1.84 లక్షల హెక్టార్లలో రైతులు వరి, మొక్కజొన్న, మినుము, పెసర, వేరుశనగ, జొన్న, పత్తి, మిరప, కంది, పప్పుశనగ, ఆముదం, ఉల్లి, పొగాకు, తదితర పంటలు సాగు చేస్తున్నారు. 2023–24 సంవత్సరానికి కిసాన్ డ్రోన్లను రాయితీపై రైతులకు పంపిణీ చేసే దిశగా కసరత్తు చేస్తోంది. తొలి విడతలో జిల్లాకు 29 కిసాన్ డ్రోన్లను మంజూరు చేయనుంది. డ్రోన్లు అక్టోబర్ నాటికి అందుబాటులోకి రానున్నాయి.

ఇకపై పిచికారీ సులభం..

డ్రోన్ల సహకారంతో ఏ కాలంలోనైనా అన్ని పంటలకు క్రిమి సంహారక మందులు పిచికారీ చేసేందుకు అనుకూలంగా ఉంటుంది. సులభంగా, వేగంగా పని పూర్తి చేసే వెసలుబాటు కలుగుతుంది. ఎత్తుగా పెరిగే కంది, పత్తి, మొక్కజొన్న, సజ్జ పంటలతోపాటు ఉద్యాన పంటలైన మామిడి, జామ, సపోట, చీని, అరటి, నేరేడు వంటి పండ్ల తోటల్లో, బురద ఉండే వరి పంటలో మందుల పిచికారీకి డ్రోన్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. తక్కువ మందును ఎక్కువ విస్తీర్ణంలో సమానంగా పిచికారీ చేసే అవకాశం ఉంటుంది.

విష ప్రభావం ఉండదు..

వివిధ పంటల్లో పురుగు మందుల పిచికారీ అంటే రైతులకు జీవన్మరణ సమస్య. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఎత్తుగా పెరిగే పంటల్లో పురుగు మందు పిచికారీ చేసే రైతులు అనేక సమస్యలు ఎదుర్కొనేవారు. ఒక్కో సమయంలో రైతులు విష ప్రభావానికి గురయ్యేవారు. కొన్ని సందర్భాల్లో విష ప్రభావంతో మృత్యువాత పడిన ఘటనలున్నాయి. డ్రోన్ల వినియోగం ద్వారా రైతులు విష ప్రభావానికి గురయ్యే అవకాశం ఉండదు. వీటి ద్వారా మందుల పిచికారీ చేసే రైతులకు పూర్తి రక్షణ లభిస్తుంది. పురుగు మందుల పిచికారీకి కూలీల సమస్య ఉండదు. ఒక పంటకాలంలో ఎకరా విస్తీర్ణంలో పురుగు మందు స్ప్రేయర్‌తో పిచికారీ చేయాలంటే దాదాపు రూ.3 వేల వరకు ఖర్చు అవుతుంది. అదే డ్రోన్ సాయంతో పిచికారీ చేస్తే కేవలం రూ.1,350తో పూర్తవుతుంది. డ్రోన్ ఖరీదు సుమారు రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షలు ఉండగా ప్రభుత్వం 40 శాతం రాయితీతో ఇస్తుంది. 50 శాతం బ్యాంకు రుణం ఇస్తారు. ఐదుగురు రైతులు ఒక గ్రూప్‌గా ఏర్పడి కేవలం 10 శాతం సొమ్ము చెల్లిస్తే సరిపోతుంది.



డ్రోన్ సాయంతో క్రిమి సంహారక మందు పిచికారీ చేస్తున్న దృశ్యం

లామ్‌ఫామ్‌లో పైలట్లకు శిక్షణ

జిల్లాలోని 29 మండలాల్లో తొలి విడతలో మండలానికి ఒక డ్రోన్ మంజూరు చేశారు. ఒక్కో గ్రూపులో ఐదుగురు చొప్పున సభ్యులతో 29 గ్రూపులు ఏర్పాటయ్యాయి. డ్రోన్ల వినియోగానికి ప్రత్యేక శిక్షణ అవసరం. విమానాలు ప్రయాణించే ప్రాంతాల్లో డ్రోన్లు వాడితే విమాన ప్రయాణానికి ఇబ్బందులు తలెత్తుతాయి. అందువల్ల డ్రోన్లు నిర్వహించే వారికి సివిల్ ఏవియేషన్ అనుమతి తప్పనిసరి. దీంతో డ్రోన్ల వినియోగంపై రైతు గ్రూపులో ఒకరికి, ఆయా గ్రూపుల్లో చదువుకున్న రైతులు లేని పక్షంలో నిరుద్యోగ యువతను ఎంపిక చేసి గుంటూరులోని లామ్‌ఫామ్‌లో ఇటీవల ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. జిల్లాలోని పాణ్యం మండలం మినహా మిగిలిన 28 మండలాల పైలట్లకు శిక్షణ పూర్తయింది. డ్రోన్ సాయంతో ఎకరా విస్తీర్ణంలో కేవలం 10 నిమిషాల్లో పురుగు మందు పిచికారీ చేసేలా శాస్త్రవేత్తలు శిక్షణ ఇచ్చారు. డ్రోన్ల వల్ల సమయం, సొమ్ము ఆదా కావడమేగాకుండా క్రిమి సంహారక మందు కూడా దుర్వినియోగం కాదు. తొలి విడతలో మండలానికి ఒక డ్రోన్‌ను కేటాయించగా దశలవారీగా రైతులందరికీ అందుబాటులో తెచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

జిల్లాలో తొలి విడతలో మంజూరు కానున్న డ్రోన్లు:	29
ఒక్కో డ్రోన్ విలువ :	రూ.10 లక్షల నుంచి రూ. 12 లక్షలు
ప్రభుత్వం ఇవ్వనున్న రాయితీ:	40 శాతం
శిక్షణ పూర్తి చేసుకున్న పైలట్లు:	20 మంది

శిక్షణ తీసుకున్నా



డ్రోన్ వినియోగంపై గుంటూరులోని లామ్‌ఫామ్‌లో ఇటీవల 10 రోజులపాటు శిక్షణ ఇచ్చారు. ఐటీఐ వరకు చదువుకున్నాను. వ్యవసాయంపై ఆసక్తి ఉండటంతో సొంత పొలంతోపాటు మరికొంత పొలాన్ని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాను. డ్రోన్ ద్వారా క్రిమి సంహారక మందు పిచికారీకి గ్రామంలో గ్రూపు ఏర్పాటు చేసుకున్నాం. డ్రోన్‌తో పురుగు మందు పిచికారీ విధానంపై పూర్తి స్థాయిలో శిక్షణ ఇచ్చారు.

– తేజవర్ధన్‌రెడ్డి, పైలట్, గుళ్లదూర్తి, కోవెలకుంట్ల మండలం

కూలీల కొరతకు చెక్



పంటల్లో పురుగు మందు పిచికారీకి డ్రోన్ల వినియోగం వల్ల కూలీల అవసరం ఉండదు. నాకున్న మూడున్నర ఎకరాల పొలంతోపాటు మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని శనగ, జొన్న పంట సాగు చేస్తున్నాను. గతంలో పైర్లపై మందుల పిచికారీకి ఇద్దరు కూలీల అవసరం ఉండేది. దీంతో ఖర్చు పెరిగి ఇబ్బందులు తలెత్తేవి. డ్రోన్ల ద్వారా మందుల పిచికారీ చేయిస్తే త్వరగా పని పూర్తి చేసుకోవచ్చు. కూలీల సమస్య ఉండదు.

– మహేశ్వరరెడ్డి, రైతు, కోవెలకుంట్ల

ఖర్చు తగ్గుతుంది



రైతులు సాగు చేసే వివిధ పంటల్లో డ్రోన్ల సాయంతో క్రిమి సంహారక మందు పిచికారీతో ఖర్చు తగ్గుతుంది. స్ప్రేయర్ల ద్వారా క్రిమి సంహారక మందు పిచికారీకి రూ.3వేల వరకు ఖర్చవుతుంది. డ్రోన్ల ద్వారా రూ.1,350తో పూర్తవుతుంది. రైతులు విష ప్రభావం బారి నుంచి రక్షించుకోవచ్చు. ఖర్చు తక్కువ, సమయం ఆదా అవుతుంది. రైతులు డ్రోన్లను సద్వినియోగం చేసుకోవాలి.

– నిరంజన్, ఏఓ, కోవెలకుంట్ల

ప్రజా సమస్యలను పరిష్కరించండి



స్పందనలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్

నంద్యాల: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అధికారులను ఆదేశించారు. బుధవారం బండిఆత్మకూరు ఎంపీడీఓ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం – స్పందన కార్యక్రమం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్‌ఓ పుల్లయ్య ఇతర జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బండిఆత్మకూరు మండలంలో రెవెన్యూ సర్వీసులకు సంబంధించి అనేక సమస్యలు వస్తున్నప్పటికీ పరిష్కారం కావడం లేదన్నారు. మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది సమన్వయంతో గడువులోగా పరిష్కరించాలన్నారు. స్పందనలో దాదాపు 100కు పైగా దరఖాస్తులు వచ్చాయని, సక్రమంగా పనిచేసి పరిష్కరిస్తే ఇన్ని దరఖాస్తులు ఎందుకు వస్తాయని సంబంధిత అధికారులు ప్రశ్నించారు. నిబంధనల మేరకు అవకాశమున్న ప్రతి సమస్యను పరిష్కరించాలన్నారు. సచివాలయంలో స్పందనకు సంబంధించి మూడు రిజిస్టర్లు నిర్వహించాలన్నారు. కింది స్థాయి సిబ్బందిలో గ్యాప్ ఉన్నట్లు స్పష్టమవుతోందని, కారణాలు చెప్పకుండా సరిచేసుకుని సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

వినతుల్లో కొన్ని..

- పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలోకి విషసర్పాలు ప్రవేశిస్తున్నాయని, పాఠశాలను పరిశీలించి విద్యార్థినులకు ఇబ్బంది లేకుండా వాటిని శుభ్రం చేయించాలని బండిఆత్మకూరుకు చెందిన అనురాధ జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు సమర్పించారు.
- సర్వే నంబర్ 633లో కొన్నేళ్లుగా సాగుచేసుకుంటున్నానని, పొలానికి కొలతలు, హద్దులు చూపించి పాసుపుస్తకం ఇప్పించగలరనీ బండిఆత్మకూరు మండలం జి.లింగాపురం గ్రామానికి చెందిన నూరుల్లా విన్నవించాడు.
- ప్రభుత్వం ఇచ్చిన సర్వే నంబర్ 5.64 లో 0.50 సెంట్ల భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నానని, ఆ భూమిని తన పేరు మీద ఆన్‌లైన్‌లో నమోదు చేయించి, పట్టాదారు పాసుపుస్తకం ఇప్పించాలని బండిఆత్మకూరు మండలం శింగవరం గ్రామస్తుడు రాముడు కోరాడు.

ప్రాజెక్టులు సమాజానికి ఉపయోగపడాలి

నంద్యాల(న్యూటౌన్): సమాజానికి ఉపయోగపడే ప్రాజెక్టులను విద్యార్థులతో తయారు చేయించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్రసాంకేతిక మండలి జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ కేవీ సుబ్బారెడ్డి సూచించారు. పాఠశాల స్థాయిలో విద్యార్థులకు శాస్త్ర పరిశోధనలపై అవగాహన పెంచి సైన్స్ ప్రాజెక్టులను తయారు చేయడానికి సైన్స్ ఉపాధ్యాయులకు స్థానిక నేషనల్ పీజీ కళాశాలలో బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహారం, జీవనోపాధి, ఆరోగ్య భద్రత, విపత్తులను ఎదుర్కోవడం లాంటి ఉపయోగకర ప్రాజెక్టులను తయారు చేయించాలన్నారు. స్థానిక సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి శాస్త్రీయ అంశాలను జోడించి నూతన విధానాలు, పరికరాలు, రసాయన మందులు, దివ్యాంగులకు ఉపయోగపడే పరికరాలు, నూతన వంగడాలు కనుగొనేలా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. విద్యార్థి స్థాయిలో నేర్చుకున్న శాస్త్రీయ అంశాలు వారిని గొప్ప శాస్త్ర వేత్తలుగా రాణించేందుకు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి సుందరరావు, ఎంఈఓ బ్రహ్మం నాయక్, ఎన్‌సీసీ కోఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ కేవీ సుబ్బారెడ్డి

బైబై గణేశా..!



జిల్లాలోని గ్రామాలు, మండల కేంద్రాల్లో వినాయక నిమజ్జనం బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వినాయక చవితిని పురస్కరించుకుని మూడు రోజులుగా పూజలందుకున్న గణనాథులు భక్తుల కోలాహలం మధ్య నిమజ్జనానికి తరలివెళ్లారు. ఊరేగింపులో యువకుల నృత్యాలు, వేషధారణలు ఆకట్టుకున్నారు. బైబై గణేషా అంటూ కోవెలకుంట్ల పట్టణ సమీపంలోని కుందూ నదిలో వినాయకుడిని నిమజ్జనం చేస్తున్న దృశ్యమిది.

– కోవెలకుంట్ల

విద్యుత్ సమస్యలకు చెక్



క్యూఆర్ కోడ్ స్టిక్కర్లు



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద స్టిక్కర్‌ను అతికిస్తున్న సిబ్బంది

- ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలకు లైట్ యాప్ ద్వారా జియో ట్యాగింగ్
- అనధికార కనెక్షన్ల తొలగింపు

గోస్పాడు: వినియోగదారులు, రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అలాగే విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారానికి నడుం బిగించింది. అందులో భాగంగా వ్యవసాయ, గృహ వినియోగదారులు, చిన్న, పెద్ద తరహా పరిశ్రమలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూసేందుకు జీఐఎస్ (జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం) వెబ్ సైట్ ద్వారా టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చింది. వ్యవసాయ డీటీఆర్ కామన్ సర్వీస్‌లకు క్యూఆర్ కోడ్ స్టిక్కర్లు అంటించి వాటిని స్కానింగ్ చేయడం ద్వారా ఆ ప్రాంతం నుంచి విద్యుత్ సిబ్బంది లైట్ యాప్ ద్వారా విద్యుత్ కనెక్షన్ ఉన్న వ్యక్తి, రైతుకు చెందిన సర్వీస్ వివరాలు అప్‌లోడ్ చేస్తున్నారు. తద్వారా అధికారులు విద్యుత్ కనెక్షన్ల డేటాతో పోల్చుకుంటారు. అనధికార సర్వీసులను తొలగిస్తారు. గోస్పాడు మండలంలో ఎల్‌టీ1–4 వినియోగదారులు 10,895 కాగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లో 1377 ఉన్నాయి. అలాగే నంద్యాల మండలంలో ఎల్‌టీ1–4 వినియోగదారులు 22,265 కాగా వ్యవసాయ కనెక్షన్‌లో 2,263 ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, స్తంభాల ఫొటోలు తీసే ఆన్‌లైన్ ప్రక్రియను సిబ్బంది ప్రారంభించారు.

జీఐఎస్‌తో ప్రయోజనం..

జీఐఎస్ ఏర్పాటు వల్ల విద్యుత్ స్తంభాలు, వ్యవసాయ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, గృహాల కనెక్షన్‌లో గ్రామాల్లోని విద్యుత్ స్తంభాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. విద్యుత్ స్తంభాలు ఒకదాని నుంచి మరొక దానికి ఎంత వ్యత్యాసంలో ఉన్నాయో కూడా నమోదు అవుతున్నాయి. వీటి ద్వారా ఫీడర్లలో లోడ్ ఎక్కువైనా.. సమభాగాలు చేయడానికి, కొత్తగా అంచనాలు వేయడానికి సులభమవుతుంది. ఎత్తు తక్కువ ఉన్న లైన్లు, రోడ్డు క్రాసింగ్‌లు, వేలాడుతున్న విద్యుత్ తీగలు, దెబ్బతిన్న స్తంభాలను గుర్తించేందుకు ఉపయోగకరంగా ఉంటుంది. ఈ సర్వే వల్ల ఫీల్డ్‌లో ఉన్న స్తంభాల స్థితిగతులు తెలుసుకుని, వాటిని పునరుద్ధరించేందుకు ఉపయోగపడుతుంది. విద్యుత్ అంతరాయం, ట్రాన్స్‌ఫార్మర్ల లోపం వంటి సాంకేతిక సమస్యలు, వినియోగదారుని వివరాలను అధికారులు ఎప్పటికప్పుడు పర్య వేక్షించవచ్చు. సమస్య ఎక్కడ ఏర్పడిందో తెలుసుకొని వాటిని వెంటనే మరమ్మతులు చేపట్టి సరఫరాను పునరుద్ధరించవచ్చు. జీఐఎస్ వల్ల ఆన్‌లైన్‌లో నమోదు చేసిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు చెందిన డిజిటల్ మ్యాప్ నమోదవుతుంది.

నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు వీలవుతుంది



వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడంతోపాటు అంతరాయం లేని సరఫరా చేసేందుకు వీలుగా ప్రభుత్వము సాంకేతిక పద్ధతినీ తీసుకువచ్చింది. ప్రతిస్తంభం, ప్రతి కనెక్షన్ లొకేషన్ క్యాప్చర్ చేసి జియో ట్యాగింగ్ చేస్తున్నాం. క్యూఆర్ కోడ్ స్కాన్ తో ఆ కనెక్షన్లు వివరాలన్నీ ఆన్ లైన్‌లో ఫీడ్ అవుతాయి. అనధికార విద్యుత్ కనెక్షన్లు తొలగించేందుకు వీలవుతుంది.

– జ్ఞానసూర్యుడు, విద్యుత్ ఏఈ, గోస్పాడు

కండక్టర్ ఆత్మహత్య

బొమ్మలసత్రం: ఆర్టీసీ బస్సు కండక్టర్ నరసింహులు(57) చెరువులో పడి బుధవారం వేకువజామున ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తాలూకా సీఐ దస్తగిరిబాబు తెలిపిన వివరాలు.. నంద్యాల పట్టణానికి చెందిన నరసింహులు ఆర్టీసీ బస్ కండక్టర్‌గా పని చేస్తున్నాడు. స్థానిక సంజీవనగర్ గేట్‌లోని ఓ ఇంట్లో భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి నివసిస్తున్నాడు. కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ వైద్యుల వద్దకు చికిత్స తీసుకుంటున్నాడు. మంగళవారం మధ్యాహ్నం అనారోగ్యంగా ఉండడంతో ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లిపోయాడు. బుధవారం వేకువజామున నరసింహులు మృతదేహం స్థానిక చిన్నచెరువులో కనిపించడంతో పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.


ఆత్మకూరులో నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథులు


కోసిగిలో...



గోస్పాడు.. పసురుపాడులో రంగులు చల్లుకుంటున్న యువకులు, ఆలూరులో ఉట్టికొడుతున్న దృశ్యం

గణనాయకా..సెలవిక

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పలు ప్రాంతాల్లో గణనాథులకు వీడ్కోలు పలికారు. వినాయక చవితి పండుగను పురస్కరించుకుని ఈనెల 18వ తేదీన మండపాల్లో కొలువుదీరిన విఘ్నేశ్వర్లు మూడు రోజుల పాటు విశేష పూజలందుకుని బుధవారం నిమజ్జనానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా నిర్వహించిన నిమజ్జనోత్సవ ర్యాలీలో చిన్నా,పెద్దా తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాల మధ్య రంగులు చల్లుకున్నారు. యువత, విద్యార్థులతో పాటు మహిళలు సైతం నృత్యాలు చేశారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు తీసుకున్నారు.

– సాక్షి, నెట్‌వర్క్


ఎమ్మిగనూరు వద్ద దిగువ కాలువలో లంబోదరుడిని నిమజ్జనం చేస్తున్న భక్తులు


ఆత్మకూరు ఎర్రగూడురు వద్ద ఎస్‌ఆర్‌ఎంసీలో గణనాథులను నిమజ్జనం చేస్తున్న దృశ్యం


డోన్‌లో గంగమ్మ ఒడికి..


కొలిమిగుండ్లలో నృత్యం చేస్తున్న యువకులు


సి.బెళగల్‌లో నిమజ్జనానికి బయలుదేరుతున్న విఘ్నేశ్వరుడు


బేతంచెర్లలో వినాయక హోమం ..


ఉయ్యాలవాడలో వినాయకుల నిమజ్జనోత్సవ ర్యాలీ

ప్రకాశం జిల్లా మేడిపి వద్ద రోడ్డు ప్రమాదం


మేడపి వద్ద హైవేపై ప్రమాదానికి గురైన ట్రావెల్స్ బస్సు


గాయపడిన వారిని అంబులెన్స్‌లో వైద్యశాలకు తరలిస్తున్న దృశ్యం

- ట్రావెల్స్ బస్సు- లారీ ఢీకొని ఒకరు మృతి, 16 మందికి గాయాలు

కర్నూలు (టౌన్)/త్రిపురాంతకం: ప్రకాశం జిల్లా మేడిపి వద్ద బుధవారం తెల్లవారు జామున ప్రైవేటు ట్రావెల్ బస్సు, ఎదురుగా వస్తున్న లారీ ఢీకొని ఒకరు మృతిచెందగా మరో 16 మంది గాయపడ్డారు. కడప నుంచి విజయవాడకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు త్రిపురాంతకం బైపాస్ ఫ్లైఓవర్ వద్ద అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని ఆగిపోయింది. దీంతో అందులో నుంచి మార్కాపురానికి చెందిన భీమిశెట్టి మానస, కడపకు చెందిన శివలక్ష్మి, మరో మహిళ అటుగా వస్తున్న ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సును ఎక్కారు. కర్నూలు నుంచి మెప్మా ట్రైనింగ్ కోసం 22 మంది ఆ ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో విజయవాడకు వెళ్తున్నారు. ట్రావెల్స్ బస్సు త్రిపురాంతకం మండలం మేడపి వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న లారీని అదుపు తప్పి ఢీకొంది. ఈ ఘటనలో మార్కాపురం


మృతురాలు మానస

చెందిన భీమిశెట్టి మానస (22) అక్కడికక్కడే మృతిచెందగా, అదే ట్రావెల్స్ బస్సు రెండో డ్రైవర్ రాజేష్ రెండు కాళ్లు విరిగాయి. ట్రావెల్స్ బస్సులో ప్రయాణిస్తున్న కర్నూలుకు చెందిన బి. శానవ్, స్రవంతి, వెంకటేశ్వరమ్మ, హేమలతారెడ్డి, రామలక్ష్మి, షఫీ ఉన్నీస, జ్యోతి, శివగంగ, మరో ఏడుగురు గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ సుమన్ తన సిబ్బందితో వెళ్లి క్షతగాత్రులను నాలుగు అంబులెన్స్‌ల్లో పల్నాడు జిల్లా వినుకొండ, గుంటూరుకు మెరుగైన వైద్య సేవల కోసం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్, ఆర్డీో అమరనాథ్, ఎంవీఐ మాధవరావు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.


గాయి పడిన ట్రావెల్ బస్సు డ్రైవర్

పరామర్శించిన మెప్మా సిటీ మేనేజర్

ప్రమాదం విషయం తెలియగానే కర్నూలు మెప్మా ఆఫీసుకు చెందిన సిటీ మేనేజర్ మురళీ, కమ్యూనిటీ ఆర్గనైజర్లతో కలిసి హుటాహుటిన వినుకొండకు బయలు దేరారు. పీడీ నాగశివలీల ఆదేశాల మేరకు మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు చేపట్టారు. ప్రమాదంలో గాయపడిన రీసోర్స్ పర్సన్లు, టీఎల్‌ఎఫ్ ఆఫీస్ బేరర్లు, జిల్లా మహిళా సమాఖ్యల అధ్యక్షులను ఆయన పరామర్శించారు.

పోలీసులపై సస్పెన్షన్ వేటు


మాట్లాడుతున్న సీఐ దివాకర్‌రెడ్డి

శ్రీశైలం: పేకాట ఆడిన హెడ్‌కానిస్టేబుల్, ఐదుగురు హోంగార్డులను ఎస్పీ రఘువీర్‌రెడ్డి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సీఐ దివాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన వన్‌టౌన్ ఎస్ఐ లక్ష్మణరావుతో కలిసి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. హెడ్ కానిస్టేబుల్ హరిప్రసాద్, హోంగార్డులు ఎం.రామలింగేశ్వరరెడ్డి, రమేష్‌కుమార్, ఎం.హరిగాంధీ, పిడతల సత్యమయ్య, జి.రామయ్య ఇటీవల శ్రీశైలమహాక్షేత్రానికి ప్రత్యేక(డిప్యుటేషన్)విధులపై వచ్చారు. వీరు పోలీసుల విశ్రాంతి గదిలో పేకాట ఆడుతున్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. స్పందించిన ఎస్పీ.. స్థానిక సీఐ, ఎస్ఐలచేత విచారణ చేయించి, నివేదికను తెప్పించుకుని పరిశీలించారు. పేకాట ఆడినట్లు తేలడంతో సస్పెండ్ చేస్తూ, నంద్యాల హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేయాల్సిందిగా ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారని సీఐ తెలిపారు.

గణేష్ నిమజ్జనంలో అపశృతి

కృష్ణగిరి: మండల పరిధిలోని కోయిలకొండ గ్రామంలో జరిగిన గణేష్ నిమజ్జనంలో బుధవారం అపశృతి చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బోయ సందుల మురళీకృష్ణ(27) గ్రామంలో విగ్రహాల ఊరేగింపు ముందు అందరితోపాటు ఉత్సాహంగా స్టెప్పులు వేస్తూ ఒక్కసారిగా గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. గమనించిన తోటి వారు వెంటనే మెరుగైన వైద్యం కోసం డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఇతను గతంలో గుండె సమస్యతో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు.

కుంటలో మునిగి యువకుడి మృతి

వెల్దుర్తి: మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామంలో బుధవారం సాయంత్రం జరిగిన వినాయక నిమజ్జనంలో అపశృతి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఊడల మద్దయ్య, నాగమ్మ కుమారుడు యు. రాజు(21) ప్రమాదవశాత్తూ నీట మునిగి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. గ్రామంలో ప్రతిష్ఠించిన వినాయకుడిని స్థానిక కుంటలో నిమజ్జనానికి తీసుకెళ్లారు. అక్కడ విగ్రహాన్ని జారవిడిచే సమయంలో రాజు నీటిలో మునిగిపోయాడు. పక్కనున్న వారు గమనించి చేయందించే ప్రయత్నం చేసినా ఫలించలేదు. చివరకు అతి కష్టం మీద బయటకు తీసి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మరణించాడు. ఏకైక కుమారుడు అయిన రాజు మరణంతో బాధిత కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

క్రీడల్లోనూ రాణించాలి

- ఎస్‌జీఎఫ్ అండర్-19 జిల్లా కార్యదర్శి పద్మావతి
- ఔట్‌డోర్ స్టేడియంలో వాలీబాల్, హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం

కర్నూలు (టౌన్): చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 జిల్లా కార్యదర్శి పద్మావతి అన్నారు. బుధవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ అండర్-19 వాలీబాల్, హ్యాండ్‌బాల్ క్రీడాంశంలో ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ కనబరిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. గురువారం ఎస్‌జీఎఫ్ నెట్‌బాల్, సాఫ్ట్‌బాల్ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.


వాలీబాల్ క్రీడాంశంలో తలపడుతున్న బాలికల జట్టు

రగ్బీ పోటీలు వాయిదా


ఈనెల 23 వ తేదీ స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో నిర్వహించాల్సిన రగ్బీ ఎంపిక పోటీలు వాయిదా వేసినట్లు ఆమె తెలిపారు.రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న పోటీల కారణంగా ఈ పోటీలను వాయిదా వేశామని, త్వరలో నిర్వహించే తేదీలుప్రకటిస్తామని వెల్లడించారు.

కుక్కల దాడిలో 30 గొర్రెపిల్లల మృతి



డోన్ రూరల్: మండల పరిధిలోని వలసల గ్రామానికి చెందిన 30 గొర్రె పిల్లలు కుక్కల దాడిలో మృతిచెందాయి. గొర్రెల కాపరి రామాంజనేయులు తెలిపిన వివరాలు.. గొర్రెల మందను కొంత కాలంగా మండల పరిధిలోని కన్నపకుంట గ్రామం వద్ద నిల్వ ఉంచుకున్నారు. మంగళవారం ఉదయం దొడ్డిలో గొర్రె పిల్లలను ఉంచి, గొర్రెల మందను మేత కోసం కొండకు తీసుకెళ్లారు. సాయంత్రం వచ్చేలోపు దొడ్డిలో కుక్కల దాడిలో 30 గొర్రెపిల్లలు మృతిచెంది ఉండటం చూసి బాధితుడు బోరున విలపించాడు. దాదాపు రూ.లక్ష నష్టం జరిగిందని, అధికారులు నష్ట పరిహారం అందించి న్యాయం చేయాలని కోరాడు.

15 టన్నుల టమాట కొనుగోలు


ప్యాపిలి టమాట మార్కెట్‌లో కొనుగోళ్లను పరిశీలిస్తున్న ఆర్‌జేడీ రామాంజనేయులు

నంద్యాల (సెంట్రల్): టమాట రైతులకు ఊరటనిస్తూ మార్కెటింగ్ శాఖ కొనుగోళ్లను వేగవంతం చేసింది. బుధవారం ప్యాపిలి టమాట మార్కెట్‌లో 15 టన్నులు కొనుగోలు చేయడం విశేషం. మార్కెటింగ్ శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయలు కొనుగోళ్లను పరిశీలించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో టమాట క్రయవిక్రయాలకు ప్యాపిలి, పత్తికొండ మార్కెట్‌లు ముఖ్యమైనవి. పత్తికొండ మార్కెట్‌లో ధరలు మెరుగ్గా ఉన్నా.. ప్యాపిలి మార్కెట్‌లో కిలో ధర రూ.7 కంటే తక్కువగా ఉంటోంది. ఈ నేపథ్యంలో మార్కెటింగ్ శాఖ ఈ నెల 19 నాటికి 40 టన్నుల టమాట కొనుగోలు చేసింది. తాజాగా మార్కెటింగ్ శాఖ ఆర్‌జేడీ రామాంజనేయులు ఆధ్వర్యంలో 15 టన్నులు కొనుగోలు చేశారు. ఈ టమాటను జిల్లాలోని వివిధ రైతు బజార్లుకు తరలించి వినియోగదారులకు నోలాస్, నో ప్రాఫిట్ కింద అమ్మకాలు సాగిస్తున్నారు.